అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్, మార్చి21: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ జేఎన్ఎన్‌యూ ఆర్ఎం కాలనీలో అక్రమ కట్టడాలు నిలిపివెయ్యాలని కమిషనర్ సరస్వతి కి వినతిపత్రం అందజేశారు. అక్రమం గా కట్టిన వాటిని కూల్చి పార్కింగ్ స్థలాలు ఉండే విధంగా చొరవ తీసుకోవాలని కాలనీవాసులు రామానంద, అజయ్‌యాదవ్ కమిషనర్ను కోరారు. విశాఖనగర్ కాలనీలో ఉన్న సమస్య లు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వివిధ కాలనీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వేరు వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అందుకు కమిషనర్ స్పందిస్తూ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని ఆమె అన్నారు. మార్చి 30 తర్వాత అన్ని సమస్యలను పరిష్కరించేందుకు తాను చొరవ తీసుకుంటానని తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి, మాజీ ప్రజాప్రతినిధులు

కందుకూరు, మార్చి 21: మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.5లక్షలతో నిర్మించే రోడ్డును మాజీ వైస్ ఎంపీపీ ఆనేగౌని సంధ్య, మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు ఆనేగౌని దామోదర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ శ్రీశైలం, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని గ్రామాలను కలపాల్సిందే

- ఫోర్త్ సిటీలో కలిపే వరకూ ఉద్యమం
- గ్రామాల విలీనం అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరిన ప్రతినిధులు
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి మహేశ్వరం మండలం బీఆర్ఎస్ నాయకుల విజ్ఞప్తి

మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్, మార్చి 21: అన్ని గ్రామాలను కలను ఫోర్త్ సిటీలో కలిపే వరకూ ఉద్యమం ఆగదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మహేశ్వరం మండల బీఆర్ఎస్ కార్యవర్గ ప్రత్యేక సమావేశం శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఏర్పాటు చేయబోతున్న ఫోర్త్ సిటీలో మహేశ్వరం మండలంలోని కేవలం రెండు గ్రామాలను మాత్రమే (తుమ్మలూరు, మోహబ్బాత్‌నగర్) కలుపుతున్నారని అన్నారు. ఫోర్త్ సిటీలో కలపాలనుకుంటే మండలంలోని 31 గ్రామ పంచాయతీలను కలపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఫోర్త్ సిటీలో కలపడానికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలం నుంచి అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో కలిపే విధంగా చొరవ తీసుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని వారు ఈ సందర్భంగా కోరారు. మహేశ్వరం మండల ప్రజల ఆవేదనను తప్పకుండా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వారికి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని గ్రామాలను ఫోర్త్ సిటీలో కలిపే విధంగా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తారని ఆమె తెలియజేశారు.

బాధితులకు ఎల్వోసీ అందజేత



సీఎం సహాయ నిధి లేఖను బాధితుడి తల్లికి అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 21: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్ గణేష్ పురికాలనీకి చెందిన గౌరవ్‌గౌడ్ కొన్ని రోజులుగా వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాధితుడికి చికిత్స కోసం ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) క్రింద రెండు లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా శుక్రవారం మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి చేతులమీదుగా బాధితుడి తల్లి సంధ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరైనా.. పనులకు నోచుకోని వైనం

అధికారులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

బడంగ్‌పేట్, మార్చి 21: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్ఎస్ రెడ్డి కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల మధ్య ఉన్న రోడ్డు వివాదాస్పదంగా మారింది. లక్ష్మీనగర్ పోవడానికి అధికారులు రోడ్డు వేయించడానికి నిధులు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయింది. ఎస్ఎస్ రెడ్డినగర్ నుంచి లక్ష్మీనగర్ పోవడానికి రోడ్డు లేదంటూ కొంతమంది కాలనీవాసులు అధికారులను పనిచేయకుండ నెలల నుంచి సతాయిస్తున్నారు. ఇది డెడ్‌ఎండ్ రోడ్ అని ఎస్ఎస్‌రెడ్డినగర్ వాసులు అడ్డుకుంటున్నారు. వీరికి మద్దతుగా అధికార కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అధికారులు కొంత మేరకు పనులు చేసినప్పటికీ మిగతా పనులు చేయకుండా అడ్డుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. లింకురోడ్డు వేస్తే తప్పేంటని అధికారులు పేర్కొంటున్నారు. రోడ్డు వేయకుండా అడ్డంగా గ్రానైట్ రాళ్లు పాతారు. దీంతో కాలనీలకు రాకపోకలు బంద్ అయిపోయాయి. శుక్రవారం అధికారులు రోడ్డు పనులు చేయడానికి వెళితే మరోసారి కాలనీలో ఉన్న కొంతమంది నాయకులు అడ్డుకున్నారు. రోడ్డు పనులు నిలిపివేయాలంటూ కొంతమంది కాంగ్రెస్ నేతలు అధికారులకు ఫోన్ చేసి పనులు ఆపేయాలని చెప్పడంతో అధికారులు మిన్నకుండి పోయారు. రోడ్డు మూసేసి కొంత కాలం నుంచి రాకపోకలు బంద్ చేశారు. రోడ్డు వేయించాలని లక్ష్మీనగర్ కాలనీవాసులు, వేయొద్దని ఎస్ఎస్ రెడ్డి నగర్ వాసులు పట్టుబడుతున్నారు. ఈ చిక్కుముడిని విప్పలేక అధికారులకు తలలు పట్టుకుంటున్నారు. అధికార పార్టీ నేతలు తల దూర్చడం వల్లనే సమస్య వివాదస్పదంగా మారినట్లు తెలుస్తోంది. అధికారులను పనిచేయకుండా ఆపడంతో వెనుతిరిగారు. పోలీస్ ప్రొటెక్షన్‌తో రోడ్డు వేయించి తీరుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రెండు కాలనీల మధ్య రోడ్డు వివాదాస్పదంగా మారి ఆందోళనకు దారితీసింది.

కొనసాగుతున్న యూసీడీ సర్వే

అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, ఆర్వో అండాలు, పద్మ, రేణుక

మలక్‌పేట, మార్చి 21: జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మూసికి ఇరువైపులా కిలోమీటర్ దూరం పరిధిలో ఉన్న నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ మురికివాడల సర్వే శుక్రవారం ముసరాంబాగ్ డివిజన్లోని సంజీవయ్య బస్తీలో జరిగింది. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం ఆర్వో అండాలు, పద్మ, రేణుక ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. మహిళలను సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో చేరేలా ప్రోత్సహించడం, తద్వారా వారికి ఆర్థిక సహాయం అందించడం, నోటిఫైడ్, నాన్‌నోటిఫైడ్ వాడల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి, విద్యుత్ వసతుల సమాచారాన్ని అధికారులకు నివేదించడం ద్వారా, మెరుగైన వసతులు కల్పించేందుకు, నిధులు మంజూరు చేసేందుకు సర్వే జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మురికివాడల అభివృద్ధికి కార్పొరేటర్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూడాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు అంబా బాయి, రాజేశ్వర్, ఉమేష్, నాగభూషణం, శోభ, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పూసల బస్తీలో కలుషిత నీరు సరఫరా

సైదాబాద్, మార్చి 21: పూసలబస్తీలో కలుషిత నీరు, లోప్రెషర్‌తో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదుతో శుక్రవారం సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. బస్తీవాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మనోహర్, లైన్‌మెన్ ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

మన్సురాబాద్: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీలలో మంచినీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మనసురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ప్రెస్‌కాలనీలో లోప్రెషర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన శుక్రవారం పర్యటించారు. కాలనీలో పవర్ బోర్‌కు వెంటనే మరమ్మతులు చేస్తామని అన్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్బీ అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతూ వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నరసింహ, రాజు, రమేష్, భవాని, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కాసాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పూసలబస్తీలో తాగు నీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

స్టడీ హాల్ ఓనర్లు జాగ్రతలు పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

ఎల్బీనగర్, మార్చి 21: స్టడీ హాల్ ఓనర్లు జాగ్రత్తలు పాటించాలని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐతోపాటు ఎస్సైలు మారయ్య, లక్ష్మణ్ అవగాహన ఏర్పాటు చేశారు. సుమారు 60 మంది హాజరయ్యారు. కాగా స్టడీహాల్ ఓనర్లకు ఇన్‌స్పెక్టర్ పలు సూచనలు చేశారు. స్టడీహాల్లో ఉండే విద్యార్థుల వివరాలు ఉండాలని, కచ్చితంగా రాత్రి 11:00 గంటల నుంచి ఉదయం 5:00 వరకు విరామం ప్రకటించాలని సూచించారు. ప్రతి స్టడీహాల్‌లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోడానికి సూచనలు చేశారు.

గృహిణి అదృశ్యం

చైతన్య

సైదాబాద్, మార్చి 21: ఇంటి నుంచి బయటికి వెళ్లిన గృహిణి అదృష్టమైన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ సింగరేణి కాలనీ నివసించే బొక్క ఆంజనేయులు, చైతన్య(32) దంపతులు. వీరికి 2009లో వివాహం కావడంతో వీరికి ముగ్గురు సంతా నం ఉన్నారు. అయితే గత కొంతకాలంగా భార్య ఇంటి సమీపంలో ఉన్న ఓ వ్యక్తితో సన్నిహితంగా ఉంటూ వస్తుంది. అదేవిధం గా గతవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి ఆమె ఇప్పటివరకు తిరిగి రాలేదు. ఇంటి సమీపంలో నివసించే వ్యక్తిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, భర్త బొక్క ఆంజనేయులు సైదాబాద్ పోలీసులకు తెలియజేశారు. సైదాబాద్ ఎస్సై సాయి కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆకుల మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

కందుకూరు, మార్చి 21: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకుల మైలారం గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ గొరిగె కలమ్మ రాజు తెలిపారు. శుక్రవారం పంచాయతీ ఆవరణలో మలక్‌పేట యశోద ఆసుపత్రి చెందిన డాక్టర్ల చేత ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు వివిధ వ్యాధులను పరీక్షించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కళమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం సంతోషకరమని అన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేయాలని సూచించారు. సరైన వైద్యం అందక గ్రామీణ ప్రాంతాల ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్వేత, సుష్మ, కుమారి, అశోక్ రాజు, మధుర, సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు మండలంలో పదో తరగతి పరీక్షకు వెళుతున్న విద్యార్థిని

వైభవంగా వెంకటేశ్వర స్వామి తిరు కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న నిర్వాహకులు

కందుకూరు, మార్చి 21: మండల పరిధిలోని నేదునూరులో వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తాజా మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, సోలిపేట అమరేందర్‌రెడ్డి, నారమోని శ్రీశైలం దంపతులు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు భక్తులు హాజరయ్యారు.

సిటీ సివిల్ కోర్టు కాలనీలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి

బడంగ్‌పేట్, మార్చి 21: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ సిటీ సివిల్ కోర్టు కాలనీలో రెండు మూడు రోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయని కాలనీ మాజీ అధ్యక్షుడు శశాంక్ మోహన్ తెలిపారు. సరైన పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడం వల్ల దొంగలు విరుచుకుపడుతున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో పోలీసులు నిగా పెట్టకపోవడంతో చోరీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇండ్లలో బంగారం, సిల్వర్ పోయిందన్నారు. దొంగల బారి నుంచి కాపాడవాలని విజ్ఞప్తి చేశారు.

సజావుగా పదో తరగతి పరీక్షలు

జిల్లెల్ల గూడలో పదో తరగతి పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద గుమిగూడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

మన్సురాబాద్, మార్చి 21: మొదటిరోజు పరీక్షలు రాసినందుకు విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకున్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఆ ప్రాంతాలు కోలాహలంగా మారిపోయాయి. విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ తల్లిదండ్రులు కనిపించారు. పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటలకు ముగిసాయి. మొదటిరోజు కావడంతో విద్యార్థులను ఉదయం 8:30 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. మనసురాబాద్, నాగోల్ డివిజన్ల పరిధి పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మంచినీటి వసతి కల్పించడంతోపాటు విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసేందుకు పాఠశాల యాజమాన్యాలు ఏర్పాట్లు చేశాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహేశ్వరం నియోజకవర్గంలో..

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంలో సజ్జావుగా పదో తరగతి పరీక్షలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. బాలాపూర్ మండల పరిధిలో 20 పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 4052 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 4036 మంది హాజరయ్యారు. 16 మంది విద్యార్థులు గైహాజరైనట్టు విద్యాధికారి కృష్ణయ్య తెలిపారు. మహేశ్వరం మండలంలో మొత్తం తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఉండగా1309 విద్యార్థులు ఉన్నారు. పరీక్షకు 1305 మంది విద్యార్థులు హాజరు కాగా నలుగురు గైహాజరైనట్లు విద్యాధికారి కస్నా నాయక్ తెలిపారు. సరూర్‌నగర్ మండలంలో 45 పరీక్ష కేంద్రాలు, 9094 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొదటిరోజు పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగినట్లు వెల్లడించారు.

సైదాబాద్ జోన్ పరిధిలో..

సైదాబాద్: సైదాబాద్ జోన్ పరిధిలో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలను సజావుగా రాశారు. 23 రెగ్యులర్ పరీక్ష సెంటర్లు ఉండగా అందులో 5,038 మంది విద్యార్థులకు కేటాయించారు. బాలురు 2,523 మంది, బాలికలు 2,515 మంది ఉన్నారు. వార్షిక పరీక్షలకు మొదటి రోజు బాలురు 2,515, బాలికలు 2,508 మంది హాజరుకావాల్సి ఉండగా 5,023మంది పరీక్షలకు హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. అందులో బాలురు 8 మంది, బాలికలు 7 మంది ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ప్రత్యేక చర్యలు తీసుకోవటం తో పరీక్షలు విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాశారు.

కందుకూరు పరిధిలో..

కందుకూరు: పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 778 మంది విద్యార్థులకు నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేదునూరు ప్రభుత్వ మోడల్ స్కూల్లో ఏ, బీ సెంటర్లతో పాటు కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో మండల కేంద్రంలోని నోబుల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు మొత్తం విద్యార్థులు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సమసౌకర్యాలు కల్పించినట్లు విద్యాధికారి నరసింహ తెలిపారు.

పురుషులతో సమానంగా మహిళలు రాణించాలి



వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత తదితరులు

మన్సురాబాద్, మార్చి 21: నాగోల్ డివిజన్ పరిధి బ్లైండ్స్ కాలనీ స్వశక్తి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. నాగోల్ మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత, సీఓ మమత హాజరై మాట్లాడుతూ.. మహిళలు ప్రతి రంగంలోనూ పురుషులతో సమానంగా రాణిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జయప్రద, డాక్టర్ శిల్ప, ఉపాధ్యాయులు భూల, రమాదేవి, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ మంగ, ప్రమీల భారతమ్మ, సంఘం అధ్యక్షురాలు వి.వరలక్ష్మి, కార్యదర్శి పుష్ప, ఆర్పీ ఆశాజ్యోతి, సంఘం లీడర్లు జి.ఉమాదేవి, విజయలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.